అవస్థల్లో 'అల్లంపల్లి'

- రోడ్డు, నీరు, వైద్యం అందక ఇబ్బందులు
- కనీస సౌకర్యాల కోసం ఏళ్లుగా ఎదురుచూపులు



సమస్యలు తీర్చాలని బాబానాయక్‌తండా వాసుల నిరసన



అల్లంపల్లి గ్రామానికి వెళ్లే దారి

కడెం: ప్రభుత్వ పథకాలతో గ్రామాలు అభివృద్ధి బాటపడుతుంటే.. కవ్వాల్‌టైగర్ జోన్ ఆంక్షలతో పలు గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. మండలంలోని ఉమ్మడి అల్లంపల్లి గ్రామ పంచాయతీ కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడుతోంది. ఏళ్లుగా వారి గోడు పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. పది అనుబంధ గ్రామలున్నా.. ఈ జీపీని ప్రభుత్వం బాబానాయక్‌తండా నూతన పంచాయతీగా ఏర్పాటు చేసింది. ప్రభుత్వాలు మారినా, మా తలరాతలు మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డే ప్రధాన సమస్య..

అల్లంపల్లి, బాబానాయక్‌తండా రెండు గ్రామ పంచాయతీల పరిధిలో గుర్రమాధిర, మీసాల భూమన్నగూడెం, గంగన్నపేట్, పాలరేగడి, చింతగూడ, కనిరాంతండా, అద్దాల తిమ్మాపూర్, మంగల్‌సింగ్‌తండా, గొండుగూడ, లంబడితండా గ్రామలున్నాయి. ఈ గ్రామలన్నింటికి చేరుకోవాలంటే ప్రధాన రహదారి నుంచి పది కిలోమీటర్లు మట్టి రోడ్డులో వెళ్లాలి. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగితే రాకపోకలు బందే. అత్యవసర సమయాల్లో వాగు దాటలేక ప్రాణాలు పోయిన సంఘటనలెన్నో. అల్లంపల్లి ఉమ్మడి జీపీ కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉండడంతో అటవీశాఖ అనుమతుల కోసం ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో గ్రామంలోని జీయర్ గురుకులాన్నీ సందర్శించిన అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అల్లంపల్లి గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తానని ఇచ్చిన హామీ నేటికీ నేరవేరలేదు. దారి సమస్యను తీరిస్తేనే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తామని ఇటీవల బాబానాయక్ తండా సర్పంచ్ రంభదేవి ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

ప్రధాన సమస్యలు...

- ప్రధాన రహదారి నుంచి అన్ని గ్రామలకు బీటీ రోడ్డు వేయాలి.
- మండల కేంద్రానికి 50కిలోమీటర్ల దూరంలో అల్లంపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్యం అందుతుంది.
- అల్లంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.
- ప్రతీ గ్రామానికి మిషన్‌భగీరథ నల్లా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- అద్దాల తిమ్మాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలి.
- త్రీఫేజ్ విద్యుత్ సరాఫరాను అందించాలి.
- గుర్రమాధిర, పాలరేగడి గ్రామలకు వెళ్లే వంతెన నిర్మించాలి.
- పాలరేగడిలో మిషన్ భగీరథ నీరందించే సోలార్ సిస్టంకు మరమ్మతులు చేయించాలి.
- బాబానాయక్‌తండాలో ఫ్లోరైడ్ సమస్యను అధిగమించేందుకు మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేయాలి. నూతన పాఠశాల భవనం నిర్మించాలి.
- మంగల్‌సింగ్‌తండాలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి.
- కనిరాంతండాలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలి.
- గొండుగూడలో నీటి సమస్యను తీర్చాలి.

భగీరథ నీటిని అందించాలి



మా గ్రామానికి నేటికి మిషన్ భగీరథ నల్లా నీరు రావడం లేదు. నీటి కోసం బావుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– వసంత్‌రావు, బాబానాయక్‌తండా

బీటీ రోడ్డు వేయాలి



మా గ్రామానికి పక్కా రోడ్డు లేక ఏళ్లుగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటలేని పరిస్థితి. పక్కా రోడ్డు లేక అంబులెన్స్ రాక ప్రాణాలు పోయిన సంఘటనలున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారినా మా రోడ్డు సమస్య తీరడం లేదు. ఇకనైన మా గ్రామానికి బీటి రోడ్డు వేయాలి.

– ముత్యాల గంగారెడ్డి, అల్లంపల్లి

పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే మేలు



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి 40కిలోమీటర్ల దూరం, ఏదైనా అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్యం అందక ఎందరో ప్రాణాలు గాల్లో కలిశాయి. అల్లంపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సర్కారు వైద్యం అందుతుంది.

– మాన్కుబాయి, సర్పంచ్, అల్లంపల్లి

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



మా గ్రామానికి ఖానాపూర్ మండలంలోని భీర్నంది సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరాఫరా అవుతుంది. వ్యవసాయ విద్యుత్ వాడే సమయంలో వోల్టేజ్ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయి. గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే లోవోల్టేజ్ సమస్య తీరి నిరంతరం విద్యుత్ సరాఫరా అవుతుంది.

– తోడసం విఠల్, చింతగూడ

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి

- అటవీ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



పాక్‌పట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఐకేరెడ్డి

సోన్: మండలంలోని జాఫ్రపూర్, సిద్దులకుంట, సాకెర, పాక్‌పట్ల, మాధాపూర్, గాంధీనగర్, లోకల్ వెల్మల్ గ్రామాల్లో శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలన చూసి ఈ నెల 30న జరిగే సాధారణ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రైతులకు 24గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టగానే రైతుబంధు సాయం రూ.16వేలకు, వికలాంగులకు రూ.5వేలు, వృద్ధులకు రూ.3వేల పింఛన్ పెంచుతామని తెలిపారు. పాక్ పట్ల గ్రామంలో రూ.3 కోట్లతో సీసీ పనులు పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఆభయహస్తం ద్వారా రూ.3వేలు, తెల్లరేషన్ కార్డు దారులకు సన్న బియ్యం అందించనున్నట్లు వివరించారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురానున్నట్లు వివరించారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో వి.సత్యనారయణగౌడ్, గ్రామ సర్పంచ్ గంగారెడ్డి పాల్గొన్నారు.

కోడలు ప్రచారం..

లక్ష్మణచాంద: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంత్రి ఐకేరెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి ప్రచారం నిర్వహించారు. శనివారం మండలంలోని చామన్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో మంత్రి ఐకేరెడ్డి కుమార్తె అల్లోల పల్లవిరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఇందులో మంత్రి ఐకే రెడ్డి కుమార్తె పల్లవిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, మండల కన్వీనర్ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

సోన్: మండల కేంద్రానికి చెందిన బీజేపీకి చెందిన 25మంది యువకులు శనివారం మాదాపూర్ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి ఐకే రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సోన్ గ్రామ సర్పంచ్ వినోద్ కుమార్, మోహినోద్దిన్, శ్రీనివాస్, అంబేకర్ ప్రసాద్, పాకాల రాంచందర్, ఆనంద్‌రెడ్డి ఉన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు



చామన్‌పెల్లిలో ప్రచారం చేస్తున్న దివ్యారెడ్డి

బీజేపీకి ఓటువేస్తే రామరాజ్యం

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే రజాకారుల రాజ్యం వస్తుందని, బీజేపీకి ఓటు వేస్తే రామరాజ్యం వస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్ అన్నారు. నిర్మల్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని శనివారం నిర్మల్ పట్టణంలోని గాంధీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. టీఎన్ స్వామి , పెంట భూమ్మన్న, మంచిర్యాల అజయ్ పాల్గొన్నారు.

అన్న మీ పనికి సాయం చేస్తా..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మండల సీనియర్ నాయకులు అద్వాల రమేష్ ప్రచారం నిర్వహించారు. కమ్మరి కొలిమి వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి కాసేపు కమ్మరి కొలిమిలో సుత్తితో పనిచేసే వ్యక్తికి సహాయం చేశాడు.. అన్న మీ ఓటు బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డికి వేయాలని అభ్యర్థించాడు. ఇందులో రంజిత్, తదితరులు ఉన్నారు.

బీజేపీలోనే మహిళలకు ప్రాధాన్యం

మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్న ప్రభుత్వం బీజేపీ అని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి సతీమణి ఏలేటి కవితారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని బాబాపూర్, న్యూకంజర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య, ఉపసర్పంచ్ సురేష్, నర్సాపూర్ సర్పంచ్ లలిత, నాయకులు జీవన్ రెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఏలేటి కవితారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం వైకుంటాపూర్, బోరిగాం, మామడ మండలం క్రోటికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శనివారం మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, అంజుకుమార్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్, భూమయ్య, సత్యం చంద్రకాంత్ పాల్గొన్నారు.



కమ్మరి కొలిమిలో సుత్తితో కొడుతున్న రమేశ్



బీజేపీలో చేరిన యువత

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి జాన్సన్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రమేశ్, ఎస్పీరెడ్డి, సోఫియాన్, ధరణి రాజేశ్, మర్సుకోల తిరుపతి, కొమ్ము విజయ్, చారులత రాథోడ్ పాల్గొన్నారు.

జన్నారం: బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచంద్ నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకులు విజయ్ ధర్మ, స్వదేశ్‌కుమార్, దేవేందర్, శంకర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయండి

ఇంద్రవెల్లి: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, వాటిని చూసి ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు ఓటు వేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలంలోని సట్వాజీగూడ, ఇంద్రవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ జాదవ్ లఖన్, మడావి భీంరావ్, కోవ రాజేశ్వర్, కనక తుకారం, బాబు ముండే ఉన్నారు.



బీఆర్‌ఎస్ నాయకులతో జాన్సన్‌నాయక్

బీఆర్‌ఎస్‌కు విశేష ప్రజాదరణ

ఖానాపూర్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు విశేష ఆదరణ వస్తోందని ఎమ్మెల్సీ దండే విఠల్, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు రవీందర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌తో కలిసి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మాట్లాడారు.

ఊపందుకున్న బీఆర్‌ఎస్ ప్రచారం..

శివాజీనగర్ కాలనీలో 2వ వార్డు కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, మాజీ ఉప సర్పంచ్ సుమన్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

కాంగ్రెస్ అభివృద్ధి ప్రజల కళ్లలో కనిపిస్తుంది

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

సారంగపూర్: వైఎస్ రాజశేఖరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేసిన అభివృద్ధే నేటికీ కనిపిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని జామ్, సారంగాపూర్, ధని, బోరిగాం గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం చేపట్టారు. నాయకులు దశరథ రాజేశ్వర్, అబ్దుల్ హాదీ, బొల్లోజి నర్సయ్య, సలీమ్, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మా నాన్నకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి

నిర్మల్‌చైన్‌గేట్: నిజమైన తెలంగాణ ఉద్యమకారుడు కుచాడి శ్రీహరిరావు అని, మా నాన్నకు నిర్మల్ ప్రజలు ఒక్కసారి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని అతడి కూతురు మాధురి అన్నారు. శనివారం తండ్రికి మద్దతుగా చింతకుంటవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సేవాదళ్ రాష్ట్ర అడిషనల్ మాజీ చీఫ్ ఎంబడి రాజేశ్వర్, ఇన్‌చార్జి గంగ్రత్ రాజేశ్వర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాకేష్, శివ, రమణ పాల్గొన్నారు.



జామ్‌లో మాట్లాడుతున్న శ్రీహరిరావు

శ్రీహరిరావును గెలిపించుకుందాం

లక్ష్మణచాంద: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని శ్రీహరిరావును గెలిపించుకుందామని ఆ పార్టీ నాయకులు ఈటెల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, నగేష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



రాజీనామా పత్రంతో రాజేశ్వర్‌రెడ్డి

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పురపాటి రాజేశ్వర్‌రెడ్డి ఆ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాడు. రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డికి పంపినట్లు శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించాడు. పార్టీ మొదటి మండలాధ్యక్షుడిగా పని చేసిన తాను ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని, సీనియర్ నాయకులు పట్టించుకోకపోవడం, పార్టీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



రాంచందర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శనివారం జిల్లా టూ విల్లర్ మెకానిక్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా పాకాల రాంచందర్, అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షుడిగా ముజీబ్, ప్రధాన కార్యదర్శి ఇసాక్, ప్రచార కార్యదర్శి రమణ, కోశాధికారి రాజేష్, జాయింట్ క్యాషియర్ తజముల్, శ్రీనివాస్ ఎన్నుకున్నారు. అనంతరం గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన పాకాల రాంచందర్‌ను కార్యవర్గం శాలువా, పూలమాలతో సన్మానించారు.

మేడిపల్లిలో కార్డెన్ సెర్చ్

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామంలో శనివారం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని 20వాహనాలను పట్టుకొని, వారికి అవగాహన కల్పించి తిరిగి ఇచ్చినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

బీఎస్‌ఎఫ్ కవాతు



నర్సాపూర్‌లో కవాతులో బీఎస్‌ఎఫ్ జవాన్లు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్, బాబాపూర్, న్యూకంజర్, తిర్పెల్లి గ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం బీఎస్‌ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు

ముధోల్: మండల కేంద్రంలో శనివారం బీఎస్‌ఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సీఐ వినోద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటును నిర్భయంగా ఉపయోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్సై సాయికిరణ్, పోలీసు సిబ్బంది, బీఎస్‌ఎఫ్ జవాన్లు ఉన్నారు.

ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ మాట్లాడుతూ చాచా నెహ్రూ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉన్నత చదవులు చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. విద్యాబోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, కల్పన, మాధవ్‌రావ్, సుదర్శన్, నర్స య్య, గంగారాణి, శంకర్, వెంకటేశ్, రమేశ్ ఉన్నారు.

విద్యార్థులను ప్రతీరోజు పాఠశాలకు పంపాలి

- రీడ్ కార్యక్రమం డైరెక్టర్ గోవర్ధన్



రాచాపూర్‌లో మాట్లాడుతున్న గోవర్ధన్

లక్ష్మణచాంద: పోషకులు తమ పిల్లలను నిత్యం పాఠశాలకు పంపాలని రీడ్ కార్యక్రమం డైరెక్టర్ గోవర్ధన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాచాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పోషకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి కృషి చేయాలని, విద్యార్థులు బడికి హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు దిలీప్ కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు, క్లస్టర్ సీఆర్‌పీ సుధాకర్ ఉన్నారు.

మామడ: మండలంలోని పాఠశాలల్లో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు.

సోన్: మండలం కేంద్రంతో పాటు పాక్‌పట్ల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు ఆరాధన, వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ కొత్త కాపు రాజేశ్వర్ నవాకాంత్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేసిన కోడె నవీన్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో గ్రామానికి చెందిన యువ సామాజిక కార్యకర్త కోడె నవీన్ తన సతీమణి స్వర్గీయ కోడె వినీల జ్ఞాపకార్థం విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ అందజేశాడు. దిలావర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ గురుకుల కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. తన పిల్లలు ఇప్పుడిప్పుడే ప్రాథమిక విద్యాభ్యాసానికి వెళ్తున్నారని, ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ప్రాథమిక విద్యార్థులకు తన వంతుగా ఎప్పటికీ వారి విద్య ఉన్నతికి పాటుబడుతానని అన్నారు. ఇందులో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కూర్తి గ్రామ శివారులోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో ఎన్నికల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చెక్‌పోస్టు వద్ద నుంచి వెళ్లే ప్రతీ వాహనాన్ని ప్రత్యేక అధికారి మధన్‌మోహన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో కలిసి బహిరంగ తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. అవసరం మేరకే నగదును పూర్తిస్థాయి ఆధారాలతో తీసుకెళ్లాలని కోరారు.